సాక్షి
పెద్దపల్లి

సోమవారం, 15, జనవరి, 2024



సుల్తానాబాద్: గాంధీనగర్‌లో నిర్వహించిన భోగి వేడుకల్లో గంగిరెద్దు విన్యాసం















గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు



భోగి సందడి

- జిల్లాలో ఘనంగా వేడుకలు
- నేడు సంక్రాంతి

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఆదివారం భోగి వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజలు ఒక్కచోట చేరి భోగి మంటలు వేసి, ఆడిపాడారు. పండుగల విలువను భావితరాలకు తెలిపే బాధ్యత మనందరిపై ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో నిర్వహించిన భోగి వేడుకలకు హాజరయ్యారు. పాడిపంటలు చేతికి వచ్చిన తర్వాత జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. పాత వస్తువులు, పేడ పిడకలు వివిధ రకాల సామగ్రిని మంటల్లో వేసి, భోగి జరుపుకుంటామని తెలిపారు. కష్టాలు తొలగి, విజయం వైపు అడుగులు వేసేలా భగవంతుడు ప్రజలందరినీ ఆశీర్వదించాలని కోరారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. జిల్లావాసులు సోమవారం అంతే ఉత్సాహంగా సంక్రాంతి జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, సతీశ్, కౌన్సిలర్ అరుణ, నాయకులున్నారు.



కమాన్‌పూర్: పెంచికల్‌పేటలో..



పండుగలకు హరిదాసు వేషం



మేము పండుగలకు కులవృత్తిగా వస్తున్న హరిదాసు వేషం వేసి, జీవనోపాధి పొందుతున్నం. మిగతా రోజుల్లో అయ్యగార్ల వృత్తిని కొనసాగిస్తం. వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర, భోగి, సంక్రాంతిలకు సుల్తానాబాద్ వస్తున్నం. హరిదాసు వేషధారణలో ఇంటింటికీ వెళ్తం. ప్రజలు ధాన్యం, డబ్బులు ఇస్తే తీసుకుంటం. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలె.

– వెంకట నర్సయ్య, మల్కాపూర్

గంగిరెద్దులతో జీవనోపాధి



మేము అనాదిగా గంగిరెద్దుల ద్వారా జీవనోపాధి పొందుతున్నం. ఇది మా కులవృత్తి. పండుగ వేళల్లో ఇంటింటికీ వెళ్లి, గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తం. ఈ సమయంలో ఉపాధి కొంత మెరుగ్గా ఉండగా, మిగతా రోజుల్లో దొరికిన పని చేసుకుంటం. కుటుంబం గడవడం ఇబ్బందికరంగా ఉంటది.

– సమ్మయ్య, వెంకటయ్య, ర్యాకల్‌దేవ్‌పల్లి, గంగిరెద్దులవారు

13 ఏళ్లుగా వేడుకల నిర్వహణ



సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో 13 ఏళ్లుగా భోగి మంటల తోపాటు పలు రకాల విన్యాసాలు నిర్వహిస్తున్నాం. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలివచ్చి, విజయవంతం చేస్తారు. భోగి మంటల వద్ద ఆటపాటలతో యువత, మహిళల నృత్యాలతో సందడిగా ఉంటుంది.

– హనుమాండ్ల అరుణ, కౌన్సిలర్, సుల్తానాబాద్



న్యూస్‌రీల్

చైనా మాంజాపై నిషేధం

- సీపీ రెమా రాజేశ్వరి



గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో చైనా మాంజాపై నిషేధం విధించినట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మినా, దానివల్ల ఎవరికైనా ప్రమాదం జరిగినా బాధ్యులపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. చైనా మాంజా ద్వారా గాలిపటాలు ఎగురవేస్తే పక్షులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం దాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమని, ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా పడతాయని పేర్కొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చండి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని సంస్థ సీఎండీ ఎన్.బలరాంను సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. శనివారం రాత్రి ఆయనను కలిసి, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అలవెన్సులపై ఇన్‌కంట్యాక్స్ మాఫీ చేయాలని, సొంతింటి పథకం కింద కార్మికులకు 250 గజాల స్థలం లేదా ఉంటున్న క్వార్టర్ కేటాయించాలన్నారు. అవినీతి, పైరవీలు లేకుండా మెడికల్ బోర్డు కొనసాగాలని, సింగరేణి ఆస్పత్రులను ఆధునీకరించాలని, గనులపై సేఫ్టీ లాకర్లు, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. నాయకులు మేదరి సారయ్య, కుంట ప్రవీణ్, అల్లి రాజేందర్, అసరి మహేశ్, రాజమౌళి, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సకల శుభాలు కలగాలి



గొల్లపల్లి(ధర్మపురి): ఈ సంక్రాంతి నుంచి ప్రజలకు సకల శుభాలు కలగాలి. అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు. ప్రతీ ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి. ప్రజలహితానికి, ప్రగతి పథానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ధర్మపురి నియోజకవర్గంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలి.

– లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే

సంస్కృతిని గౌరవించాలి



సుల్తానాబాద్: సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, పండుగల విలువను భావితరాలకు తెలిపే బాధ్యత మనందరిపై ఉంది. ఆదివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో భోగి వేడుకలకు హాజరయ్యా. కష్టాలు తొలగి, విజయం వైపు అడుగులు వేసేలా భగవంతుడు ప్రజలందరినీ ఆశీర్వదించాలి.

– విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

కొత్త కాంతులు నింపాలి



గోదావరిఖని(రామగుండం): పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపి, సంక్రాంతి పండుగ అందరి కుటుంబాల్లో కొత్త కాంతులు నింపాలి. ఆదివారం మా నివాసం వద్ద నా సతీమణి మనాలిఠాకూర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భోగి మంటలు వేశాం. సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్ రామగుండం ఎమ్మెల్యే

వర్షాలు సమృద్ధిగా కురవాలి



వేములవాడ: సంక్రాంత్రి పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలి. నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉండాలి. అందరికీ పండుగ శుభాకాంక్షలు.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

పండుగ ప్రజలు, కార్యకర్తలతోనే..



కోరుట్ల: ఏటా సంక్రాంతికి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేవాన్ని. ఈసారి మాత్రం ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గడపడానికే ప్రాధాన్యం ఇచ్చాను. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే తమ్ముడు శశివర్ధన్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్లా. అందరికీ పండుగ శుభాకాంక్షలు.

– సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే

ఓదెలలో అందుబాటులోకి కోనేరు

- మల్లన్న సన్నిధిలో 60 ఏళ్ల తర్వాత ప్రారంభం



కోనేరును ప్రారంభించిన ఆలయ కమిటీ, స్నానం చేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లన్న భక్తులకు భోగీ పండుగ శుభవార్త. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కోనేరును ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, పాలకవర్గసభ్యులు ఆదివారం ప్రారంభించారు. 60 ఏళ్లుగా ఇక్కడ కోనేరు లేక భక్తులు మంచినీటి బావులు, ట్యాంకుల కింద స్నానాలు ఆచరించి, పూజలు చేస్తున్నారు. వారి కష్టాలను చూసి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, కోనేరు నిర్మాణం కోసం సీడీఎఫ్ కింద రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిర్మాణం పూర్తవడంతో పంపింగ్ సిస్టంను ఏర్పాటు చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. కోనేరు ప్రారంభించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఓదెల మల్లికార్జునస్వామి భక్తుల సౌకర్యార్థం కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చులతో గెస్ట్ హౌస్ నిర్మిస్తుండగా పనులను ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఈవో పరిశీలించారు. స్నానాల గదులు, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణంపై చర్చించారు. ఆలయ ఈవో బి.సదయ్య, ప్రధాన అర్చకుడు వీరభద్రయ్య, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్, పాలకవర్గ సభ్యులు కనికిరెడ్డి సతీశ్, గంప కిశోర్, ఆరెల్లి మొండయ్యగౌడ్, మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, కర్రె కుమారస్వామి, చింతం వెంకటస్వామి పాల్గొన్నారు.

సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించాలి

- జీపీఎల్ స్పందించకుంటే నిర్వాసిత రైతులు సాగు చేస్తారు..
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి, గోలివాడ తదితర గ్రామాల పరిధిలో బీపీఎల్ సేకరించిన భూముల్లో సత్వరమే పరిశ్రమలు స్థాపించి, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సంస్థ యాజమాన్యం స్పందించకుంటే నిర్వాసిత రైతులు ఆ భూముల్లో పంటలు సాగు చేస్తారని పేర్కొన్నారు. తర్వాత రైతులపై కవ్వింపు చర్యలకు దిగితే ఉపేక్షించబోమన్నారు. ఈ మేరకు ఆదివారం బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థ స్థాపన కోసం బీపీఎల్ సుమారు 1,900 ఎకరాల వ్యవసాయ భూములను సేకరించి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయని తెలిపారు. పరిశ్రమలు ఏర్పడి, స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని రైతులు ఆశతో భూములను ఇచ్చి, తీవ్రంగా నష్టపోయారన్నారు. బీపీఎల్ యాజమాన్యం పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం స్వాగతిస్తుందని, తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో ఈ భూములపై కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం

పెద్దపల్లిరూరల్: భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా తంగెడ రాజేశ్వర్‌రావు, మాతంగి రేణుక, సల్వ లక్ష్మీనర్సయ్య, మచ్చగిరి రాము, ప్రధాన కార్యదర్శిగా పొల్సాని సంపత్‌రావు, తాత రవియాదవ్, మామిడి రాజేశ్, కార్యదర్శులుగా తొడుపునూరి కృష్ణమూర్తి, జంగ చక్రధర్‌రెడ్డి, ఈర్ల శంకర్, పెద్దపల్లి పవన్‌లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోల్ల శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా చిలుక భారతి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పెద్దపల్లి రవీందర్‌లను నియమించామని తెలిపారు.

సంక్రాంతి కోసం ఖండాలు దాటొచ్చారు..



ముగ్గుపై గొబ్బెమ్మ పెడుతున్న దరియా



దరియా-అరుణ్ దంపతులు

పెద్దపల్లిరూరల్: సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని బ్రిటన్ నుంచి పెద్దపల్లికి వచ్చారు దరియా-అరుణ్ దంపతులు. ఉద్యోగ నిమిత్తం బ్రిటన్ వెళ్లిన అరుణ్ అక్కడ పోలెండ్ దేశస్తురాలు దరియాను ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. ఆమెతో కలిసి పెద్దపల్లిలో ఉండే తల్లిదండ్రులు రాంరెడ్డి-రోహిణిల వద్దకు వచ్చాడు. భోగి పండుగ రోజు ఆదివారం అత్త రోహిణి ముగ్గులు వేయగా, కోడలు దరియా వాటిపై గొబ్బెమ్మలను ఉంచింది. అనంతరం స్థానిక కోదండ రామాలయంలో గోదాదేవిరంగనాథులస్వామి కల్యాణాన్ని వీక్షించడం ఆనందంగా ఉందని తెలిపింది. కల్యాణోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఫొటోలు దిగారు.

వకీల్‌పల్లి గని జీవితకాలం పెంచాలి

- డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే.శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): వకీల్‌పల్లిగని జీవితకాలం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వకీల్‌పల్లి గని, ఓసీపీ-3 ప్రాజెక్టులను ఆయన సందర్శించారు. ముందుగా గని ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గని పని స్థలాలను పరిశీలించారు. కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల ద్వారా ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓసీపీ-3 ఫేజ్-2లో ఓబీ తొలగించే కాంట్రాక్టర్లతో మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఓసీపీ-3 వ్యూపాయింట్ ద్వారా పని స్థలాలను పరిశీలించి, ఉత్పత్తి పెంచేందుకు పలు సూచనలు చేశారు. రాబోయే రెండు నెలలు వార్షిక లక్ష్యాల సాధనకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని పేర్కొన్నారు. ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, వకీల్‌పల్లి గని అఫియేటింగ్ ప్రాజెక్టు అధికారి రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ, గని మేనేజర్ రవికిరణ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్, సేఫ్టీ అధికారి రామ్‌కుమార్, సర్వే అధికారి అఫ్సర్ పాషా తదితరులున్నారు.

సమస్యలపై ప్రధానికి లోకోపైలట్ల పోస్టుకార్డులు



పోస్టుకార్డులను చూపుతున్న లోకోపైలట్లు

రామగుండం: ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ కేంద్ర కమిటీ సూచనల మేరకు రామగుండం లోకోపైలట్లు తమ సమస్యలను పోస్టుకార్డులపై రాసి, ప్రధాని మోదీకి ఆదివారం పోస్టు చేశారు. పని భారం తగ్గించాలని, సెలవు దినాలు పెంచాలని, హైపవర్ కమిటీ సూచనలను రైల్వే బోర్డు అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వాటిలో పేర్కొన్నారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ రామగుండం బ్రాంచి కార్యదర్శి సీహెచ్.రవి, రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, మహేశ్, ప్రశాంత్, పురుషోత్తం, మీనా తదితరులున్నారు.

క్లుప్తంగా

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



దినేశ్

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం వలంటీర్ కల్యాణం దినేశ్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ యువజన కార్యకలాపాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో 12 రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొంటారని, మన రాష్ట్రం నుంచి దినేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అతన్ని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు సురేశ్‌కుమార్, రమేశ్‌రెడ్డి, రవి, సావిత్రి, అజయ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రసాద్, కో–ఆర్డినేటర్ మనోహర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మహిళ మృతదేహం

బసంత్‌నగర్(రామగుండం): రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. శనివారం రాత్రి బసంత్‌నగర్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతురాలి వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్ నంబర్ 87126 56509కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరారు.

పందెం కోడి

• చిన్నప్పటి నుంచే ఖరీదైన తిండి • ప్రత్యేక దృష్టి.. స్పెషల్ ట్రైనింగ్

“ సాక్షి, కరీంనగర్ డెస్క్: సంక్రాంతి తెలుగింట పెద్దపండుగ. భోగింటలు.. ముగ్గులు.. పిండివంటలు.. పతంగులే కాదు.. కోడి పందాలు ఓ భాగమే. పందెం కోళ్లను పెంచడానికి చాలాజాగ్రత్తలు తీసుకుంటారు. ఆ కోళ్లను సొంత బిడ్డల్లా పెంచుతారు. ఈత నేర్పడం.. వేడినీళ్ల స్నానం.. బాదం.. పిస్తా పప్పులు.. కోడిగుడ్డు సొన.. మధ్యాహ్నం భోజనంలో ఉడికించిన వేట మాంసం.. కీమా లడ్డూలు.. డిన్నర్ తర్వాత ఖరీదైన బి–కాంప్లెక్స్ గోలీలు.. దాహం వస్తే మినరల్ వాటర్ ఇస్తారు. సంక్రాంతి మూడు రోజులే.. కానీ.. పందెపు కోళ్లకు మూడు నెలల ముందు నుంచే పండుగ. అసలుసిసలు పందెం పుంజులకోసం. పోరాడే సత్తా ఉన్న కోడిపెట్టతో మరో కోడిపుంజును జతచేసి ఓకచోట ఉంచుతారు. నెల రోజుల తర్వాత ఆ గుడ్లను పొదిగిస్తారు. వాటిలో మంచి లక్షణాలున్న పుంజు పిల్లను ఎంపిక చేసి ఏడాదిపాటు అత్యంత శ్రద్ధతో పెంచుతారు. ”

పోషకాల తిండి..

రోజువారీ అయితే చోళ్లు, రాగులు, గంట్లు వంటి అపరాలే. స్పెషల్ ఫుడ్ అంటే బాదం, కోడిగుడ్డులోని తెల్లసొన. పందాలకు 15 రోజుల ముందు నుంచి రోజూ ఉడికించిన మాంసపు విందు. అదనంగా బి–కాంప్లెక్స్ గోలీలు.







చిన్నప్పటి నుంచే శిక్షణ..

ఉదయాన్నే కాలువలు.. చెరువుల్లో ఈత. ఎండలో సుమారు రెండుగంటపాటు ఆరనివ్వడం. ఆయాసం వచ్చి పడిపోతే కఫం బయటకు వచ్చేలా నోట్లో నీరు పోసి సొంగకొట్టడం. నిత్యం మసాజ్ సదుపాయం కూడా.. ఆరోగ్యంగా ఉండేందుకు, బద్ధకం వీడేందుకు ఉదయాన్నే ఆవిరి పట్టడం. దోమలు కుట్టకుండా ఫ్యాన్ల ఏర్పాటు ఉంటుంది.



• పుంజు ఖరీదు లక్షల్లోనే..

సాధారణ పందెపు కోడి రూ. 10 నుంచి 20 వేల వరకు ఉంటే.. జాతికోళ్ల ధర రూ.25 వేల నుంచి 50 వేల వరకు ఉంటుంది. ఒకటిరెండు పందాల్లో గెలిచిన చరిత్ర ఉండే పుంజులు లక్ష కూడా పలుకుతాయి. ఒక్కో పుంజుకు దాని జాతిని బట్టి నెలకు రూ.3 నుంచి రూ.5 వేల వరకు తిండికి ఖర్చు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక అనుభవం ఉన్న జీతగాళ్లు ఉంటారు.

• స్పెషల్ ట్రైనర్లు...

కోళ్లకు తర్ఫీదు ఇచ్చేందుకు కోల్‌కతా నుంచి స్పెషల్ ట్రైనర్లు ఉంటారు. పండుగకు 15 రోజుల ముందు రంగంలోకి దిగుతారు. ఉభయ గోదావరి జిల్లాలకే ఈ తరహా స్పెషల్ కోచ్‌లు సుమారు వంద నుంచి రెండు వందల మంది వస్తుంటారు.

• కోడి ఎంపిక శాస్త్రబద్ధం..

ఏ రాశిలో ఏ జాతి పుంజు పందెం కొడుతుందో తెలుసుకోవడానికి కుక్కుట శాస్త్రాలు అనుసరిస్తారు. కాకి, డేగ, నెమలి, తీతువ, పర్ల, పెట్టమారు, పింగ్ల, పచ్చకాకి, అబ్రాస్, రసంగి, పువ్వల, కొక్కిరాయి వంటి వాటిని ఒకదానిపై ఒకటి ఎత్తుగడగా ఎంచుకొని బరిలోకి దించుతారు. బరిలో దిగిన పుంజుల రంగుల్ని బట్టి గెలుపోటములను అంచనా వేసి పందాలు కాస్తారు.

• సీక్రెట్ ఇదీ..

పుంజుల వంశావళి వివరాలు ఎంతో రహస్యం. బయటకు పొక్కితే అంతకన్నా మేలు రకం పుంజులను ప్రత్యర్థులు బరిలోకి దించుతారు. పందాలు ముగిసేవరకు పుంజులకు బ్రహ్మచర్య వ్రతం తప్పదు. తదనుగుణంగా వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకుంటారు.

• కత్తుల సమరం..

కోస్తా జిల్లాల్లో రెండు రకాల పందాలు జరుగుతాయి. చూపుడు పందాల్లో అక్కడికి వచ్చిన పందెంరాళయుళ్లు తమతమ పుంజులను చూపించుకొని వారిద్దరూ ఇష్టపూర్వకంగా నచ్చిన మొత్తానికి పందెం వేస్తారు. ఎత్తుడు.. దింపుడు పందెం రెండు వర్గాల మధ్య జరుగుతుంది. పందెం మొత్తం, సంఖ్యను ముందు నిర్ణయించుకుంటారు. ఒక వర్గం వారు తమ కోడి పుంజును బరిలో దిపంగానే.. రెండో వర్గం వారు కూడా తమ పుంజును దింపుతారు. పందెంరాయుళ్లు తమకు నచ్చిన పుంజుపై పందెం కాస్తారు. మళ్లీ రెండో వర్గం వారు బరిలో దింపిన పుంజుపై మొదటి వర్గం వారు తాము ఎంచుకున్న పుంజును బరిలోకి దింపుతారు. ఇలా వరుసగా ముందు అనుకున్నన్ని పందేలు నిర్వహిస్తారు. గతంలో కోళ్లకు కత్తులుండేవి కాదు. రోజుల తరబడి కొట్లాడుకున్నాక చివరి వరకు నిలచిన పుంజు గెలిచినట్లు ప్రకటించేవారు. ఈ మధ్య కత్తియుద్ధాలే ఎక్కువగా జరుగుతున్నాయి. పందేలపై ఎకరాల కొద్దీ భూములు, లక్షలాది రూపాయల మొత్తాన్ని పణంగా పెడుతుంటారు. పందెంలో పుంజు గెలిస్తే లభించే పేరు.. ప్రఖ్యాతల కోసం ఇంకా ఎక్కువ ఖర్చు చేయడానికైనా వెనుకాడరు.

• మాంసానికి యమ క్రేజ్..

పరాజయం పాలై నెత్తురోడుతూ నేలరాలిన కోడిని కోసమాంసంగా పిలుస్తారు. దీనికి క్రేజ్ ఎక్కువ. కోస మాంసం ధర రూ. రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు పలుకుతుంది. అయితే కోసమాంసాన్ని అమ్మేవారు తక్కువ. ఇంటిల్లిపాది కలిసి తినడం, ఆత్మీయులకు పంపడం చేస్తుంటారు.

కోడి అ'ధర'హో

• పెద్దజాతి కోడిపుంజులకు కేరాఫ్ శివపల్లి
• రూ.2 వేల నుంచి రూ.15 వేలు పలుకుతున్న ధర
• ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు ఎగుమతి




శివపల్లెలో కోడిపుంజులు

ఎలిగేడు: పందెంకోడి అ'ధర'హో అనిపిస్తోంది. మేలుజాతి కోడిపుంజులకు భలేగిరాకీ ఉంటోంది. ఒకప్పుడు కోడిపందేలకు కేరాఫ్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామం ఇప్పుడు కోడి పుంజుల పెంపకానికి నిలయంగా మారింది. శివపల్లిలో పెద్దజాతి కోడి పుంజులు ఇంటింటా పెంచుతుండడంతో కొనుగోలు చేసేందుకు జిల్లాతో పాటు ఏపీ, మహారాష్ట్ర నుంచి కూడా వస్తున్నారు. దీంతో ఒకప్పుడు కోడి పందేలు నిర్వహించిన గ్రామానికి చెందిన వారు ఇప్పుడు మేలుజాతి కోడిపుంజులు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మేలుజాతి కోడిపుంజు కిలోకు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు పలుకుతున్నాయి. పెద్దవాటికి రూ.15వేల వరకు వెచ్చిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కోడిపుంజులు మహారాష్ట్ర ,ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు ప్రాంతాలకు తరలించి కోడి పందేలకు వినియోగిస్తారని చెబుతున్నారు.



• ఉమ్మడి జిల్లాలో జోరు..

ఒకప్పుడు పందెం కోళ్ల పెంచడం.. పందేలు ఆడడం ఆంధ్రాకే పరిమితం. ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలాచోట్ల పందెం కోళ్లను పెంచుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పిల్లకోళ్లను ఇక్కడికి దిగుమతి చేసుకొని ఫాంలు నడుపుతున్నారు. ఆరునెలల కోడి మొదలు ఏడాది వయసున్న కోళ్లను నేరుగా.. ఆలన్‌లైన్ ద్వారా పందెంరాయుళ్లకు అమ్ముతున్నారు. అంతేకాదు.. జిల్లాలో కొన్నిచోట్ల పందేలు కాస్తున్నట్లు సమాచారం.

ఎఫ్‌సీఐ భూముల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు


నిర్మాణాన్ని తొలగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎఫ్‌సీఐ భూముల్లో ఆదివారం తెల్లవారుజామున నిర్మించిన అక్రమ నిర్మాణాలను ఆర్‌ఎఫ్‌సీఎల్ సెక్యూరిటీ అధికారులు కూల్చివేశారు. కొంత మంది కర్మాగారానికి సంబంధించిన భూములను కబ్జా చేస్తూ ప్రహరీ నిర్మిస్తున్నారు. దీనిపై యాజమాన్యం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా భూముల హద్దులు సూచించలేదు. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సుమారు 200 ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఉన్నతాధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: నగరంలోని కోరా ఉన్నత పాఠశాలకు చెందిన రాగిని, శ్రీజ, శరణ్య, యోగేశ్వరి, శ్రీహిత ఈనెల 11న రామడుగు మండలంలో జూనియర్స్ విభాగంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనగా.. యోగేశ్వరి, శ్రీహిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటలతో పిల్లల్లో మానసిక శక్తి పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులను, పీఈటీలను అభినందించారు. ఈనెల 15 నుంచి 17 వరకు రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు వెళ్లనున్నారని తెలిపారు. మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ అభినందించారు.

ఫెస్టివల్ కప్ హాకీ పోటీలు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం హుజూరాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో 5ఏ సైడ్ ఫెస్టివల్ కప్ ఒక రోజు హాకీ పోటీలు జరిగాయి. హుజూరాబాద్ ప్రాంతంలో ఉన్న హాకీ క్రీడాకారుల నైపుణ్యం మరింత మెరుగుపరిచేందుకు.. వారిలో ఉత్సాహం నింపేందుకు.. క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. హాకీ క్లబ్ జిల్లా నాయకుడు బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హుజురాబాద్ ప్రాంతం హాకీ క్రీడాకారులకు పెట్టింది పేరన్నారు. సామాజిక కార్యకర్త వర్థినేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు బాధ్యతను నిర్వహిస్తానని, హాకీ క్లబ్ భవన నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందిస్తానన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఉమామహేశ్వర్, క్రీడాకారులు, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, చింత శ్రీనివాస్, సజ్జు, రమేశ్, సన్నీ, కోచ్‌లు రవికుమార్, టి.శ్రీనివాస్, నాయకులు ధనవర్ష రాజు, రాజా లింగారెడ్డి, సలీం, డిష్ రమేశ్, యూసుఫ్, ప్రదీప్, రాజేశ్, బత్తుల సమ్మయ్య, తిరుపతి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సేవలో తరించేందుకు గౌడ నిత్యాన్నదాన సత్రం పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో నిర్మిస్తున్న గౌడ నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్మాణ పనుల కోసం ఇప్పటికే అనేకమంది దాతల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించామని తెలిపారు. కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. తొందరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని సంఘం నాయకులకు సూచించారు.

నిజాయితీకి గుర్తింపు

• కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్


బొల్గం శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, కవులు, పాత్రికేయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సమాజ సంక్షేమానికి నిజాయితీగా పనిచేసేవారికి ఏ రంగంలోనైనా గుర్తింపు ఉంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బొల్గం శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్వోగా నియమితులై మొదటిసారి ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. నారాయణపూర్ గ్రామం కవులు, కళాకారులు, విద్యావేత్తలు, ఉద్యోగులకు పుట్టినిల్లని అన్నారు. ఈ మట్టిలో పుట్టిన ప్రతీ బిడ్డ ఏదో ఒక రంగంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ఉన్నత స్థానాలు సాధించిన వారు ఉండగా.. ప్రస్తుతం సీఎం పీఆర్వోగా శ్రీనివాస్ నియామకం కావడంతో గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. బొల్గం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిజం కత్తిమీద సాములాంటిదని, ఈ వృత్తిలో ఎన్ని కష్టాలు ఉంటాయో.. అంత ఎంజాయ్ చేయవచ్చన్నారు. కలుషితం కాకుండా వృత్తినే దైవంగా భావించి, పనిచేసే వారికి అనేక అవకాశాలు వస్తాయని తెలిపారు. సీఎం పీఆర్వో ఊహించని అవకాశమని, దీన్ని సమాజ మంచి కోసం వినియోగిస్తానన్నారు. పురిటిగడ్డ రుణం తీర్చుకోవడానికి వైద్యం, అభివృద్ధిపరంగా తన సాయశక్తులా కృషి చేస్తానన్నారు. మండల విలేకరి నుంచి సీఎం పీఆర్వోగా ఎదిగిన క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, కుటుంబానికి సైతం సమయం కేటాయించకుండా నిబద్ధతతో పని చేశానని తెలిపారు. ఆ కష్టానికి ప్రతిఫలమే ఈ అవకాశమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, డీపీఆర్వో మామిండ్ల దశరథం, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బుర్క గోపాల్, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపేరా సుల్తానా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, డీఎస్‌వో పాముల దేవయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


పొన్నంకు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు లభించేలా చొరవ తీసుకోవాలని కోరారు. 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, బ్లాక్ చేయబడిన 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పండిట్, పీఈటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, జయేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్, హరికిషన్, నాగరాజు, వినోద్, రాంరెడ్డి, మొగిలి, కాంతయ్య, వేణుగోపాలచారి, మొగిలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక


జానకిని అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: వరంగల్ జిల్లాలో డిసెంబర్ 30, 31ల్లో జరిగిన జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రినిటి కళాశాల విద్యార్థి బి.జానకి ప్రతిభ కనబరిచి రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 14 నుంచి 17 వరకు జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ట్రినిటి కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎన్.రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.